క్లుప్తంగా

నాణ్యమైన ప్రసాదాలు అందించాలి


నూతన పొయ్యిలను ప్రారంభిస్తున్న ఈఓ శ్రీనివాసరెడ్డి

మహానంది: మహానందీశ్వరస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు నాణ్యమైన ప్రసాదాలను అందించాలని ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి సూచించారు. మహానందీశ్వరస్వామి దేవస్థానంలోని లడ్డూ పోటు ప్రసాదాల తయారీ కేంద్రంలో నూతన పొయ్యిలు, చిమ్నీలను శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ భక్తులకు అందించే లడ్డూ, పులిహోర తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య పాల్గొన్నారు.

మహానందీశుడికి పల్లకీసేవ


మహానందిలో పల్లకీసేవ దృశ్యం

మహానంది: మహానందీశ్వరస్వామి దంపతులకు శుక్రవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. దేవస్థానం ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ పి.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు ముందుగా స్థానిక అలంకార మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శాస్త్రోక్త పూజల అనంతరం మహానందీశుడి దంపతులను పల్లకీలో కొలువు తీర్చి గోమాతలను పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకీ ముందు నడిపించగా భాజాభజంత్రీలు, మేళతాళాల మధ్య పల్లకోత్సవం కనుల పండువగా సాగింది.

భ్రమరాంబాదేవికి ఊయలసేవ


అమ్మవారికి ఊయలసేవ నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం దేవస్థాన అర్చకులు ఊయలసేవ నిర్వహించారు. సాయంత్రం లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ ముందుగా సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజలను నిర్వహించిన అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. శ్రీశైలగ్రామ దేవత అంకాళమ్మ అమ్మవారికి కూడా విశేష పూజలు నిర్వహించారు.

నందీశ్వరుడికి పూజలు


శనగల బసవన్నకు పూజలు నిర్వహిస్తున్నఅర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలోని స్వామి అమ్మవార్ల ఆలయ ప్రాంగణంలోని శనగల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి అర్చకులు శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. 25 మంది భక్తులు పరోక్షసేవగా నందీశ్వరస్వామి విశేష పూజను జరిపించుకున్నారు. నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాది అర్చనలను నిర్వహించారు. ఆరంభ పూజలలో భాగంగా లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. అనంతరం ఈ కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు గణపతి పూజను చేశారు. తరువాత నందీశ్వర స్వామికి శాస్త్రోక్తంగా పంచామృతాలతో, ఫలోదకాలతో అలాగే మల్లికాగుండంలోని శుద్ధజలంతో అభిషేకం నిర్వహించారు. అనంతరం నూతన వస్త్ర సమర్పణ విశేషార్చనలను, నానపెట్టిన శనగలను, క్షేత్రపాలకునికి ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించి కర్పూరనీరాజనాలు అర్పించారు.

7న కొత్తూరు ఆలయం మూసివేత


శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయం

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయాన్ని ఈనెల 7న మూసివేస్తున్నట్లు ఈఓ రామకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. చంద్ర గ్రహణాన్ని పురస్కరించుకొని ఆదివారం మధ్యాహ్నం 1 గంటకు మూసివేసి సోమవారం ఉదయం 5 గంటలకు తిరిగి తెరుస్తామని వెల్లడించారు. భక్తులు ఈ విషయాన్ని గ్రహించాలన్నారు.


పూజల్లో పాల్గొన్న ఆర్యవైశ్య మహిళలు

భక్తిశ్రద్ధలతో గజగౌరీ వ్రతం

ఆత్మకూరులోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శుక్రవారం గజగౌరీ వ్రతం (9 గౌరమ్మల పూజ) నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం మహిళా మండలి అధ్యక్షురాలు జీవరత్నమ్మ, సెక్రటరీ దేవరశెట్టి కళ్యాణి ఆధ్వర్యంలో మహిళలు పసుపు, కుంకుమ, గంధం, అక్షింతలతో పాటు 26 రకాల వస్తువులతో అమ్మవారిని అలంకరించి విశేష పూజలు చేశారు. – ఆత్మకూరు


అమ్మవారికి పూజలు చేస్తున్న ఆర్యవైశ్య మహిళలు

ప్రవక్త మార్గం అనుసరణీయం


నూతన వస్త్రాలు సమర్పిస్తున్న ముస్లింలు


సందేశం ఇస్తున్న మత పెద్దలు సయ్యద్ నయాముద్దీన్ ఖాద్రీ

పాములపాడు: మహ్మద్ ప్రవక్త సూచించిన మార్గం అనుసరణీయమని మౌలానా(మత గురువు) సుభాన్ అన్నారు. మిలాద్ ఉన్ నబీ పండుగను ముస్లింలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. మండలంలోని మసీదుల్లో నిర్వహించిన ప్రార్థనల్లో భాగంగా ప్రత్యేక దువాతో అల్లాను వేడుకున్నారు.

● **వెలుగోడు:** మండలంలో శుక్రవారం మిలాద్ ఉన్ నబీ వేడుకలు ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండల కేంద్రంలో మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు.

భక్తులు పాలు, నూతన వస్త్రాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ముతవల్లీలు ఆసర్ వజీర్ బాషా, బురహానుద్దీన్, రఫీ, ఇనయతుల్లా, ఖజా మొహిద్దీన్ తదితరులు ప్రవక్త సందేశాన్ని వినిపించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్‌ఐ సురేష్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

● **నందికొట్కూరు:** మిలాదున్‌నబీ వేడుకలు శుక్రవారం కేజీఎస్ అధినేత సయ్యద్ అబ్దుల్ గఫార్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మత పెద్దలు సయ్యద్ నయాముద్దీన్ ఖాద్రీ మాట్లాడుతూ శాంతి, ప్రేమ, సహనం, త్యాగం, సేవా మార్గంలో జీవించాలని అల్లాహ్ సందేశాన్ని ఇచ్చారన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం


హుస్సేన్ సాహెబ్‌ను సన్మానిస్తున్న కలెక్టర్, మంత్రి ,


రిటైర్డ్ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న విద్యార్థులు

ఆత్మకూరు: పట్టణంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భారత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర సెక్రటరీ మోమిన్‌మున్నీర్‌బాషా, రైతుసేవా సంఘం ఆత్మకూరు అధ్యక్షులు బైరాపురం రహంతుల్లా, కృషి పండ్ల తోటల సంఘం అధ్యక్షులు మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

భక్తకన్నప్ప గురుకులం ఆవాసంలో..

కొత్తపల్లి: మండల పరిధిలోని గోకవరం గ్రామంలోని భక్తకన్నప్ప గురుకులం ఆవాసంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని శుక్రవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా జరుపుకున్నారు. విభాగ సంఘచాలక్ బి నీలకంఠేశ్వర్, రిటైర్డ్ ఇంజినీర్ జి రఘురామయ్య, ఆవాస కార్యదర్శి ఎం.రఘురాములు, రిటైర్డ్ ఎంఈఓ కే నాగేశ్వరరావు, రిటైర్డ్ టీచర్లు బి శంకర్ సింగ్, సి చంద్రశేఖర్‌లు తదితరులు పాల్గొని సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు రిటైర్డ్ ఉపాధ్యాయులను సన్మానించారు.


విద్యార్థులకు నోటు పుస్తకాలను అందజేస్తున్న మోమిన్‌మున్నీర్‌బాషా

సన్మానం



వెలుగోడు: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికై నా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు జీఎల్ నరసింహులు, మొహియుద్దీన్‌ను శుక్రవారం తోటి ఉపాధ్యాయులు పార్థసారథి రెడ్డి, బాలయ్య, మాబాషా, శ్రీనివాస్ నాయక్, శ్రీనివాస్ ఆచారి, సుబ్బరాయుడు నాయక్ తదితరులు జీఎల్ నరసింహులు, మొహియుద్దీన్‌ను శుక్రవారం నంద్యాలలో ఘనంగా సన్మానించారు.

యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న కూటమి నాయకులు

నందికొట్కూరు: యూరియాను కూటమి నాయకులు బ్లాక్ మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు ఆరోపించారు. శుక్రవారం మిడుతూరులో రైతులకు యూరియాను సరఫరా చేయాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు యూరియా అందించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. తిమ్మాపురం, చెరుకుచెర్ల, బైరాపురం, కడుమూరు గ్రామాలకు రహదారులు గుంతమయంగా మారినా కూటమి నేతలు కన్నెత్తి చూడటం లేదని ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చిన తర్వాత రహదారులకు మరమ్మతులు చేశామని గొప్పలు చెప్పుకోవడం తప్ప ఏ రోడ్డుకు కూడా మరమ్మతులు చేయించిన దాఖలాలు లేవన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నాగరాజు, గాబ్రియేల్, సోమన్న, నరసింహులు, ఏసన్న, శ్రీనివాసులు, శీలన్న, విజయకుమార్, లక్ష్మీదేవి, ముర్తుజాబి, రామకృష్ణ, చిన్నకృష్ణ, వెంకటస్వామి, వెంకటరమణ, తిరుపాలు, మద్దిలేటి పాల్గొన్నారు.

యూరియాను సద్వినియోగం చేసుకోండి


యూరియా పంపిణీని పరిశీలిస్తున్న ఏడీఏ హేమలత

ఆత్మకూరు: యూరియాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ హేమలత సూచించారు. యూరియా పంపిణీని ఆమె శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ పిన్నాపురంలో 23.94 టన్నులు, సిద్ధాపురంలో 23.94 టన్నులు, కురుకుంద–1 రైతుసేవా కేంద్రంలో 23.94 టన్నులు, కొట్టాల చెరువులో 11.97 టన్నులు, కృష్ణాపురంలో 11.97 టన్నులు, శ్రీపతిరావుపేటలో 11.97 టన్నులు, వడ్లరామాపురంలో 11.97 టన్నులు యూరియా పంపిణీ చేశామన్నారు. రైతులకు సరిపడిన యూరియాను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు


విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యాధికారి పవన్‌కుమార్

ఆత్మకూరు: మండలంలోని వెంకటాపురం గ్రామంలో ఉన్న ఎస్సీ బాలుర వసతిగృహంలో శుక్రవారం వైద్యాధికారి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. 30 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి పవన్‌కుమార్ మాట్లాడుతూ వసతిగృహాల్లో పిల్లలు ఎక్కువగా ఉండడం వల్ల గజ్జి, తామర వంటి చర్మవ్యాధులకు లోనయ్యే అవకాశం ఉందన్నారు. ప్రతిరోజూ స్నానం చేసి, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని విద్యార్థులకు సూచించారు. దుస్తులను ఎడకు ఆరబెట్టుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున రాత్రిపూట దోమతెరలను వాడాలని సూచించారు.

కేసీ కెనాల్‌లో దూకి వ్యక్తి ఆత్మహత్య

కర్నూలు: మద్యం మత్తులో కేసీ కెనాల్‌లో దూకి 45 ఏళ్ల వయస్సు గల వ్యక్తి మృతిచెందాడు. వినాయక ఘాట్ సమీపంలోని గ్రీన్ పార్కు బార్ వద్ద శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయంలో మద్యం మత్తులో ఓ వ్యక్తి కేసీ కెనాల్‌లోకి దూకాడు. స్థానికులు కాపాడే ప్రయత్నం చేశారు. అయితే నీళ్లలో మునిగిపోవడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. మూడో పట్టణ ఏఎస్‌ఐ ఓబులేసు అక్కడికి చేరుకుని నీటిలో మునిగిపోయిన మృతదేహాన్ని యువకుల సహాయంతో వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించి భద్రపరిచారు. మృతుడు 5.2 అడుగుల ఎత్తు, ఛామన ఛాయ వర్ణం కలిగి ఉన్నాడు. అతనికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో గుర్తు తెలియని మృతదేహం కింద కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

మహిళ మృతదేహం వెలికితీత

కర్నూలు: కేసీ కెనాల్‌లో కొట్టుకుపోతున్న మహిళ మృతదేహాన్ని స్థానికుల సాయంతో పోలీసులు వెలికితీసి ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ కేంద్రంలో భద్రపరిచారు. కెనాల్ పైభాగం నుంచి మృతదేహం నీటిలో కొట్టుకుపోతుండగా గణేష్ నగర్ శివాలయం వద్ద స్థానికులు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకుని కాలువ నుంచి మృతదేహాన్ని వెలికితీశారు. మృతురాలికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి భద్రపరిచారు. సుమారు 40 ఏళ్ల వయస్సు ఉండి 4.5 అడుగుల ఎత్తు, నల్లని వెంట్రుకలు ఉన్నాయి. పసుపు రంగు చీర, ఆకుపచ్చ కలర్ జాకెట్ ధరించింది. ఆచూకీ తెలిసినవారు 94404 20901 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని ఏఎస్‌ఐ ఓబులేసు కోరారు.

కార్యకర్తలతో నేడు శిల్పా సమావేశం


ఆత్మకూరు: నంద్యాల పట్టణంలోని పద్మావతి నగర్‌లో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి కార్యకర్తలతో సమావేశం కానున్నారని పార్టీ నాయకులు శుక్రవారం తెలిపారు. ఆత్మకూరు, మహానంది, బండిఆత్మకూరు మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీలోని వివిధ విభాగాల నాయకులు హాజరుకావాలన్నారు. ఈనెల 9న యూరియా కొరతపై రైతులతో కలిసి చేపట్టనున్న ధర్నాకు సంబంధించిన పార్టీ శ్రేణులతో చర్చించనున్నారన్నారు.

ఆరోగ్యశ్రీకి కూటమి ఉరితాడు

బొమ్మలసత్రం: పేదలకు విలువైన కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందించేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకానికి కూటమి ప్రభుత్వం ఉరితాడు బిగిస్తోందని ఏపీఎస్పీడీసీఎల్ మాజీ డైరెక్టర్ శశికళ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేసేందుకు కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పిల్లల కోసం కొత్తగా 17 మెడికల్ కళాశాలలు నిర్మాణానికి పూనుకున్నారన్నారు. ఆయన పాలనలోనే 10 మెడికల్ కళాశాలల పనులు పూర్తి అయ్యాయన్నారు. కూటమి సర్కారు ఏర్పడిన తర్వాత మెడికల్ కాలేజీలపై దృష్టి సారించకపోగా రాష్ట్రానికి అదనంగా మెడికల్ సీట్లు అవసరం లేదని కేంద్రానికి చెప్పి మెడికల్ విద్యను దూరం చేసిందన్నారు. త్వరలో 10 మెడికల్ కళాశాలలను ప్రైవేట్ వ్యక్తులకు 63 ఏళ్ల పాటు లీజ్‌కు ఇచ్చేందుకు చంద్రబాబు సర్కారు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఆరోగ్యశ్రీ పథకం అమలు చేయకపోవడం ద్వారా పేదలు ఇక నుంచి ఉచిత వైద్యం పొందేందుకు బీమా కంపెనీల చుట్టు తిరగాల్సి రానుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గతంలో రూ. 25 లక్షల వరకు ఖర్చు అయ్యే వైద్యాన్ని ఆరోగ్యశ్రీ ద్వారానే పొందేలా చేశారని, ఇప్పుడు కూటమి సర్కారు ఈ పథకాన్ని ప్రైవేట్‌కు అప్పగించడం సరికాదన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పాములపాడు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద బైక్ అదుపు తప్పిన ప్రమాదంలో ఇద్దరు గాయాలపాలైన ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. తుమ్మలూరు గ్రామానికి చెందిన దర్గయ్య పాములపాడు నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. ప్రభుత్వ వైద్య శాల వద్ద కుక్కను తప్పించబోయి అదుపు తప్పి ఆశా వర్కర్ దేవమణిని బైక్ ఢీకొని కింద పడ్డాడు. ప్రమాదంలో గాయపడిన దర్గయ్య, దేవమణిలను 108 వాహనంలో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.


గాయాలపాలైన దర్గయ్య

డేంజర్ ఫుడ్ !

- నాణ్యత లేని చిరుతిండ్లతో పొంచి ఉన్న ముప్పు
- చిన్నారులే లక్ష్యంగా రకరకాల స్నాక్స్ ప్యాకెట్లు
- ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- కనీస తనిఖీలు కూడా చేయని అధికారులు


దుకాణంలో విక్రయిస్తున్న చిరుతిండ్ల ప్యాకెట్లు

గడివేముల: నాణ్యత లేని చిరుతిండ్లతో చిన్నారులకు ముప్పు పొంచి ఉంది. చిన్నారులనే లక్ష్యంగా చేసుకుని ఆకర్షించే రంగులతో రకరకాల ప్యాకెట్లలో స్నాక్స్ తయారు చేసి షాపులకు సరఫరా చేసి విక్రయిస్తున్నారు. చిన్నారులు వాటి వైపు ఆకర్షితులై కొనుక్కొని తినడం వల్ల అనారోగ్యం బారిన పడుతున్నారు. మండల పరిధిలోని ప్రతి గ్రామంలో పదుల సంఖ్యలో దుకాణాల్లో ఎక్కడా చూసినా నాణ్యత లేని ఆహార పదార్థాల ప్యాకెట్లు కనిపిస్తున్నాయి. వ్యాపారస్తులు చేసే జిమ్మిక్కులకు తోడు పిల్లలను ఆకట్టుకునేలా కార్టూన్ బొమ్మలు, రంగురంగుల ప్యాకింగ్‌లలో చిరుతిండ్లు దర్శనమిస్తున్నాయి. వీటిని చూడగానే కొనివ్వాలంటూ చిన్నారులు మారం చేయడంతో తప్పనిసరి పరిస్థితుల్లో తల్లిదండ్రులు కొనుగోలు చేసి ఇస్తున్నారు. చివరకు అవి చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. వీటి వల్ల భవిష్యత్‌లో పెను ముప్పు తప్పదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

విచ్చలవిడిగా కల్తీ ఆహార పదార్థాలు

ధనార్జనే ధ్యేయంగా సకిలీ చిరుతిండ్లను విచ్చలవిడిగా మార్కెట్లోకి వదులుతున్నారు. స్నాక్స్ ప్యాకెట్లుగా వాటిని చలామణి చేస్తున్నారు. వాటిపై తయారయ్యే ప్రాంత చిరునామా, ఎంఎఫ్‌డీ కూడా ఉండదు. సంస్థ పేర్లు కూడా అర్థం కాని రీతిలో ఉంటాయి. మరికొన్ని అయితే ప్రముఖ కంపెనీల పేరును పోలి ఉంటూ మార్కెట్లోకి వస్తాయి. చూడగానే తినాలనిపించే రకంగా వాటిని తయారు చేస్తున్నారు. దుకాణాల్లో విచ్చలవిడిగా ప్యాకెట్ల దండలు వేలాడతీసి అమ్ముతున్నారు. వీటికి సంబంధించి మండలంలో ప్రతిరోజూ వేలాది రూపాయల వ్యాపారం జరుగుతోందనేది నగ్నసత్యం. వీటిపై కనీస తనిఖీలు లేకపోవడంతో ఎవరి ఇష్టం వారిది అన్నట్లుగా పరిస్థితి తయారైంది.

నిప్పులవాగుకు నీటిసరఫరా

జూపాడుబంగ్లా: వర్షాల వల్ల కేసీ కాల్వకు సాగునీటి సరఫరా తగ్గించగా వర్షాలు తగ్గటంతో కేసీ కాల్వకు సాగునీటి సరఫరా పెంచినట్లు ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సుంకేసుల డ్యాం నుంచి కేసీ కాల్వకు 2,450 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. రైతుల వినియోగార్థం లాకిన్స్‌లకు 1,170 క్యూసెక్కుల నీరు చేరుతున్నట్లు తెలిపారు. ఈ నీటిని తూడిచెర్ల సబ్‌ఛానల్ కాల్వకు 420 క్యూసెక్కులు, నిప్పులవాగుకు 740 క్యూసెక్కులు, ఏబీఆర్ కాల్వకు 10 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.

నేడు మండల సర్వసభ్యసమావేశం

జూపాడుబంగ్లా: ఎంపీపీ సువర్ణమ్మ అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్యసమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గోపీకృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలన్నారు.

నిందితులను అరెస్ట్ చేయాలి

జూపాడుబంగ్లా: శ్రీకాకులం జిల్లా ఆముదాలవలస మండలం కొత్తవలస గ్రామానికి చెందిన రజకులపై దాడిచేసి హత్యచేసిన వారిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని రజక సంక్షేమ సంఘం రాష్ట్ర మాజీ నాయకుడు బస్తిపాటి మౌలాలి, మండల అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రచార కార్యదర్శి నాగభూషణం డిమాండ్ చేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ రజకులపై రోజురోజుకు దాడులు పెరిగిపోతున్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి రజకులకు ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురు భక్తులకు గాయాలు

ఆళ్లగడ్డ: ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు భక్తులు గాయపడ్డ సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎగువ అహోబిలం లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని దిగువ అహోబిలం వచ్చేందుకు భక్తులు ఆటో ఎక్కారు. ఓం నమోనారాయణ మలుపు సమీపంలోకి వచ్చేసరికి ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అహోబిలం గ్రామానికి చెందిన వడ్ల రాజ్యలక్ష్మితో పాటో మరో ముగ్గురు గాయపడ్డారు. గాయపడ్డ వారిని ఆళ్లగడ్డ వైద్యశాలకు తరలించి చికిత్స చేయిస్తున్నారు.

అమెరికా తీరుపై నిరసన

నంద్యాల(న్యూటౌన్): మనదేశ ఉత్పత్తులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధిస్తున్న సుంకాలను నిరసిస్తూ నేడు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వామపక్ష నాయకులు ప్రసాద్, లక్ష్మణ్, మహమ్మద్ గౌస్ తెలిపారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆందోళన కార్యక్రమంలో వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు శంకర్, రామరాజు, వెంకటలింగం, సోమన్న, నాగరాముడు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం


కల్యాణం క్రతువు నిర్వహిస్తున్న వేదపండితులు

చాగలమర్రి: శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి కళ్యాణం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. మండలంలోని మూడురాళ్లపల్లె గ్రామంలో వెలసిన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి జన్మ నక్షత్రమైన శ్రావణ నక్షత్రం సందర్భంగా శుక్రవారం ఉభయదారులు కామిశెట్టి ప్రసాద్, ప్రమీల దంపతులు స్వామికి పూజలు చేసి కళ్యాణం జరిపించారు. అర్చకులు దుర్భాక అనిల్ కుమార్, లోకేష్ శర్మలు కల్యాణ క్రతువుల్లో భాగంగా ఉదయం గణపతిపూజ, పుణ్యహవాచనం, కంకణపూజ, కంకణ ధారణ, యజ్ఞోపవిత ధారణ, మధుపర్క సమర్పణ, పాద ప్రక్షాళన, మాంగళ్యపూజ, పట్టు వస్త్రాల సమర్పణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. తర్వాత అశేష భక్తజనం మధ్య స్వామి కల్యాణం నిర్వహించి పల్లకీలో ఊరేగించారు. భక్తుల సౌకర్యార్థం ఉభయదారుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చిన్న ఓబుల్‌రెడ్డి మహేశ్వరరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, కమిశెట్టి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాల ఏర్పాటు

కొత్తపల్లి: మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో 'అంధకారం' శీర్షికన సాక్షి పత్రికలో గత నెల 24న ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వీధి దీపాల ఏర్పాటుకు శుక్రవారం చర్యలు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి అరుణబాయి ఆధ్వర్యంలో సిబ్బంది వీధి లైట్లు ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.